## క్లుప్తంగా

### 'తెలియక తప్పులు జరిగి ఉంటే క్షమించండి'

బెల్లంపల్లి: తాను తెలిసి ఏలాంటి తప్పులు చేయలేదు. ఒకవేళ తెలియకుండా ఏదో తీరుగా పొరపాటున నా వల్ల తప్పులు జరిగి ఉంటే మన్నించాలని బెల్లంపల్లికి చెందిన విలేకరి బద్రి శివ ప్రసాద్ ప్రజలను బహిరంగ క్షమాపణ కోరారు. మావోయిస్టుల హెచ్చరికల నేపథ్యంలో మంగళవారం బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ తనను ఉద్దేశించి హెచ్చరికలు చేయడం బాధించాయన్నారు. తాను ఏ మహిళను, మరెవరినీ కూడా ఇబ్బందులకు గురి చేయలేదన్నారు. బెదిరింపులకు పాల్పడలేదన్నారు. ప్రభాత్ హెచ్చరికలు చేసిన రాత్రి కొందరు తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారని, వారి వల్ల తన ప్రాణాలకు ముప్పు ఉందని భయాందోళన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తుల నుంచి తన ప్రాణాలు కాపాడాలని తెలిపారు.

### ఫోన్ అప్పగింత

నెన్నెల: మండల కేంద్రానికి చెందిన అల్లంపల్లి సంతోష్ 15రోజుల క్రితం బెల్లంపల్లి నుంచి నెన్నెలకు వస్తుండగా ఫోన్ పోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను గుర్తించి మంగళవారం ఎస్సై ప్రసాద్ బాధితుడికి అప్పగించారు. మండలంలో ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటు వేసేందుకు వచ్చిన విద్యార్థులు

జన్నారం: విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన పెంచేందుకు, ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని హౌజ్, వాయు హౌజ్, జల్ హౌజ్, పృథ్వీ హౌజ్‌ల పేరుతో విద్యార్థులు ఎన్నికల్లో పోటీ చేశారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఓటింగ్ ద్వారా ఎన్నుకుంటారని, అదే విధంగా ఎన్నికల ద్వారా పాఠశాల లీడర్‌ను కూడా ఎన్నుకుంటారని పాఠశాల చైర్మన్ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. దీని ద్వారా ఎన్నికల నిర్వహణ, ముఖ్యమంత్రి ఎన్నుకునే విధానం విద్యార్థులకు చిన్నతనం నుంచే నేర్పడానికి ఈ మాక్‌పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి స్లేట్ హైస్కూల్ వ్యవస్థాపకులు సుభాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


### 'కొనసాగుతున్న వివాదం'



ఎఫ్‌బీవోతో మాట్లాడుతున్న రైతులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో రైతులు, అటవీశాఖ అధికారుల మధ్య వివాదాస్పదం కొనసాగుతోంది. అటవీశాఖ అధికారులు మంగళవారం రైతులను పంట పొలాల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో రైతులు తమకు పట్టా పాసు పుస్తకాలు ఉన్నాయని, ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని ఫారెస్టు అధికారులకు తమ గోడును విన్నవించుకున్నారు. అయినప్పటికీ భూముల్లోకి వెళ్లనీయకుండా కాపలా కాస్తున్నారన్నారు. ఉదయం నుంచి రైతులు కూడా అక్కడే ఉన్నారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వం పట్టించుకొని ఫారెస్టు అధికారులు అడ్డు చెప్పకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

### అధికారుల దృష్టికి సమస్యలు



అధికారులకు సమస్యలు వివరిస్తున్న కౌన్సిలర్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 5వ వార్డులో ఉన్న విద్యుత్ సమస్యలపై వార్డు కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ, వార్డు ప్రజలు ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం విద్యుత్ శాఖ అధికారులు వార్డులో పర్యటించి, సమస్యలను పరిశీలించారు. విద్యుత్ శాఖ ఏడి వేణుగోపాల్, లైన్‌మెన్ శ్రీనివాస్ వార్డుకు రాగా సంతోశ్ నగర్‌లోని 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, మల్లన్న గుడి వద్ద కూడా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసే పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపినట్లు వార్డు కౌన్సిలర్ తెలిపారు.

# భూ వివాదం తీరేదెన్నడో..!

- మళ్లీ తెరపైకి వివాదాస్పద భూములు
- సాగును అడ్డుకుంటున్న అటవీశాఖ
- న్యాయం చేయాలని రైతుల వేడుకోలు



పట్టా పాసు పుస్తకాలతో పంట పొలాల వద్ద ఆస్నాద రైతులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామ శివారులో 582, 730 సర్వే నంబర్లలో మొత్తం 785 ఎకరాల భూమి ఉండగా 1971 నుంచి ఆ భూముల్లో సాగుచేసుకుంటున్నామని రైతులు చెబుతుండగా, అటవీ శాఖ అధికారులు సాగుచేసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. ఆ భూముల్లో పంటలు పండించుకుంటూ 1971లోనే పట్టా పాసు పుస్తకాలు పొంది, బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందుతున్నామని రైతులు అంటున్నారు. ఇందులో 400ఎకరాలకు 232మంది రైతులు పట్టాలు కలిగి ఉండగా, 80ఎకరాలలో 30 మంది రైతులు ఖాస్తులో ఉంటూ పంటలు సాగు చేసుకుంటున్నారు. 50ఏళ్లకు పైగా తాతల కాలం నుంచి పట్టాలు పొంది, సాగు చేసుకుంటున్నామని బాధిత రైతులు తెలిపారు. 2018లో కూడా నూతన పట్టా పాసు పుస్తకాలను ప్రభుత్వం అందజేసింది.

**2015లో రైతులకు నోటీసులు జారీ..**

2015లో అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీశాఖకు చెందినవని హైకోర్టు నుంచి ఆదేశాలు తీసుకొచ్చి, ఈ భూముల్లో రైతులు వ్యవసాయం చేస్తే కేసులు పెట్టనున్నట్లు రైతులకు నోటీసులు జారీ చేశారు. కానీ తమకు ప్రభుత్వం లావుని పట్టాల కింద పట్టాలు తయారు చేసి ఇచ్చిందని, ఎన్నో ఏళ్లుగా తాము ఈ భూములను సాగు చేసుకొని బతుకుతున్నామని, ఈ భూములు ఫారెస్టుకు ఎలా చెందుతాయని బాధిత రైతులు అప్పటి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, విచారణ నిమిత్తం అప్పటి ఎఫ్ఎస్ఓ (ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి) అరుణ కుమారి, మంచిర్యాల ఆర్డీవో అయేషా మస్రత్ ఖానమ్, ఎఫ్ఆర్వో అప్పయ్యలు కలిసి ఆస్నాద గ్రామ శివారులోని వివాస్పద భూములను స్వయంగా వెళ్లి పరిశీలించారు. రైతులు సాగు చేసుకుంటున్న భూములను, పంటల సాగు కోసం ఏర్పాటు చేసుకున్న బోరు బావులను, సాగు నీరందించే ఎర్ర చెరువును, రెవెన్యూ మ్యాప్‌లను, ఫారెస్టు మ్యాప్‌లను పరిశీలించారు. అయినా అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమస్య రాలేదు. మళ్లీ 2019లో అటవీశాఖ అధికారులు మళ్లీ అడ్డుకున్నారు. కానీ అప్పటి ఎమ్మెల్యే, మంత్రికి రైతులు తెలపడంతో వారి చొరవతో వివాదం కొద్ది రోజులు సద్దు మణిగింది.

**మళ్లీ రైతులను అడ్డుకుంటున్న అటవీశాఖ...**

మళ్లీ ప్రస్తుతం అటవీశాఖ అధికారులు భూములు సాగు చేసుకోకుండా రైతులను అడ్డుకుంటున్నారు. ఈ విషయమై మంచిర్యాల జిల్లా కలెక్టర్‌ను, చెన్నూర్ ఎఫ్‌డీవోను రైతులు కలిసి వినతిపత్రాలు అందజేశారు. కానీ అటవీశాఖ అధికారులు సాగు పనులు చేసుకోకుండా అడ్డుకుంటున్నారని, కేసులు కూడా బనాయిస్తామనంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

### రికార్డులు పరిశీలిస్తాం

చెన్నూర్ మండలంలోని ఆస్నాద గ్రామ శివారులోని ఏయే సర్వే నంబర్లలో పట్టాలు కలిగి ఉన్నారో, రికార్డులను పరిశీలిస్తాం. ఒక వేళ ఫారెస్టు శాఖకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాళ్ల జాయింట్ సర్వే కోసం అప్పీలు చేస్తే రెవెన్యూ, అటవీశాఖల అధికారులు కలిసి జాయింట్ సర్వే చేపట్టి వారి భూమి, రెవెన్యూ భూములను గుర్తించి, రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తాం.

- మల్లిఖార్జున్, తహసీల్దార్, చెన్నూర్

### జాయింట్ సర్వే చేపడుతాం

చెన్నూర్ మండలంలోని ఆస్నాద గ్రామ శివారులో అటవీశాఖ భూములు ఉన్నాయి. అటవీశాఖ భూములకు ఎవరూ పట్టాలు ఇచ్చే అధికారం లేదు. అటవీశాఖ భూముల్లో పట్టాలు ఉంటే వాటిని రద్దు చేయడం జరుగుతుంది. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూములు ఉంటే కలెక్టర్‌కు నివేదిక అందిస్తే వాటిని బట్టి జాయింట్ సర్వే చేయమంటే చేయడం జరుగుతుంది.

- రమేశ్, ఎఫ్‌డీవో, చెన్నూర్

### న్యాయం చేయాలి



ఆస్నాద గ్రామ శివారులోని 582సర్వే నంబరులో రెండెకరాల భూమి ని 50ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. మాకు పట్టాలు కూడా ఉన్నాయి. కొత్తగా పట్టా పాసు పుస్తకాలు కూడా ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ ఫారెస్టు అధికారులు ఫారెస్టు భూములు అంటే ఎలా? మేము ఎక్కడికి పోవాలి. మాకు అధికారులు న్యాయం చేయాలి.

- రాజయ్య, రైతు, ఆస్నాద

### జాయింట్ సర్వే చేయాలి



మాకు 582 సర్వే నంబరులో ఎకరంనర భూ మి మా తాతల కాలం నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్నాం. ఇప్పుడు ఫారెస్టు భూములు అంటే ఎలా? గతంలోనే ఈ భూములను మా పేరిట పట్టాలు చేసి ఇచ్చారు. ప్రభుత్వం జాయింట్ సర్వేలు చేసి మాకు న్యాయం జరిగేలా చూడాలి.

- ఇంగిలి లింగయ్య, రైతు, ఆస్నాద

### రెండున్నర ఎకరాలకు పట్టా ఉంది



నాకు 582 సర్వే నంబరులో రెండున్నర ఎకరాల పట్టా భూమి ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూమిలో పంటను సాగు చేసుకుంటూ వస్తున్నాం. ఎప్పటికీ అటవీశాఖతో మాకు ఇబ్బందులు వస్తున్నాయి. మాకు న్యాయం చేయాలి

- గజ్జెల రామాగౌడ్, రైతు, ఆస్నాద

## ■ బొగ్గుబాయి వార్తలు

### పాన్‌కార్డు అనుసంధానం చేసుకోవాలి

శ్రీరాంపూర్: ఏరియాలో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగులు తమ పాన్ కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలని శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటికి 700మంది తమ పాన్ కార్డును ఆధార్ కార్డుతో లింక్ చేసుకోలేదన్నారు. దీని వల్ల ఆదాయ పన్ను శాఖ అధికారులు సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటుందని, ఇందులో భాగంగా వారికి జరిమానా విధిస్తారన్నారు. ఉద్యోగులు ఆధార్ కార్డుకు తమ పాన్‌కార్డు లింక్ చేసుకోవాల్సిందిగా సూచించారు.

### పరిశుభ్రత పాటించాలి

శ్రీరాంపూర్: వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్ రెడ్డి తెలిపారు. ఆర్కే 6 గనిపై సీజన్ వ్యాధులపై మంగళవారం అవగాహన కల్పించారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంచకూడదని కొబ్బరి బోండాలు, పాత టైర్లు ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి కాదాసి శ్రీనివాస్, అధికారులు కొమురయ్య, శ్యామ్ కుమార్, మహేష్ ఏఐటీయూసీ సెక్రెటరీ సంఘం సదానందం తదితరులు పాల్గొన్నారు.

### రేపు గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్

మందమర్రిరూరల్: విధులకు కొంత కాలంగా గైర్హాజరవుతున్న ఏరియా కార్మికులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు విధులకు గైర్హాజరయ్యే కార్మికులు వారి కుటుంబ సభ్యులతో హాజరై, ఎందుకు గైర్హాజర్ అవుతున్నారో, ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



చెన్నూర్‌రూరల్: మొక్క నాటుతున్న డీఆర్డీవో



జైపూర్: మొక్క నాటుతున్న నాయకులు, అధికారులు



వేమనపల్లి: మొక్క వద్ద నాయకులు, అధికారులు

చెన్నూర్‌రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ అన్నారు. ఇంటికి 5మొక్కలు నాటాలని సూచించారు. మండలంలోని కిష్టంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మంగళవారం జరిగిన వనమహోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ చల్ల రాంరెడ్డి, ఎంపీడీవో మోహన్, ఎంపీవో బీరయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాని, టీఏ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ దివాకర్ పాల్గొన్నారు.

జైపూర్: భావితరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించడమే ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటి వాటిని కాపాడాలని ఎంపీపీ గోదావరి రమాదేవి తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలలో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో బాపు, గురుకులం ప్రిన్సిపాల్ బాలభాస్కర్, కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామపంచాయతీ కేంద్రంలో వనమహోత్సవంలో భాగంగా ఎంపీటీసీ సంతోష్‌కుమార్, తహసీల్దార్ రమేష్ ఆధ్వర్యంలో కెనాల్ ఫండ్‌పై మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. అన్ని గ్రామపంచాయతీల్లో ఇంటింటికీ ఆరు పండ్ల మొక్కలు నాటుకోవాలని మొత్తం 89,600 మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో అనిల్‌కుమార్, సీడీసీఎల్ఆర్‌సీ సురేష్, ఏపీవో సత్యప్రసాద్, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శి అశోక్, నాయకులు పాల్గొన్నారు.

# 'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న డీఆర్‌ఏవో రాథోడ్ బిక్కు



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్

మందమర్రిరూరల్: స్థానిక ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ (పీఏసీఎస్) ఆఫీస్‌లో మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు అధ్యక్షతన రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ చేపట్టారు. జిల్లా డిప్యూటీ రిజిస్టర్ ఆడిట్ ఆఫీసర్ రాథోడ్ బిక్కు, ఎంపీపీ గుర్రం మంగ హాజరై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ నసీరొద్దీన్, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

నెన్నెల: రైతు భరోసాను ఏ విధంగా అందజేస్తే మేలు జరుగుతుందనే విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, డీఆర్‌డీవో రాథోడ్ బిక్కులు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. రైతువేదికలో సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రైతు భరోసా, సలహాలు, సూచనలు, ప్రత్యేక మహాజన సభ సమావేశంలో పాల్గొని అభిప్రాయాలు సేకరించారు. కొంత మంది రైతులు సాగులో ఉన్న ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇవ్వాలని, కొంత మంది రైతులు పది ఎకరాల్లోపు రైతులకు మాత్రమే అందజేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. వర్షాకాలంలో పంటల సాగుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను వ్యవసాయాధికారులు వివరించారు. రైతులు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాస్, ఏవో శ్రీకాంత్, ఏఈవో రాంచందర్, పీఏసీఎస్ సెక్రెటరీ రాజేష్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

# ప్రధాని దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: దేశంలో లాభాల బాటలో నడుస్తున్న సింగరేణితో పాటు ఎల్ఐసీ సంస్థలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక కొత్త బస్టాండ్ ప్రాంతంలో ప్రధాని దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. సింగరేణి వేలాన్ని ఆపాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, నాయకులు చీర్ల సుధాకర్‌రెడ్డి, బాపగౌడ్, హిమవంతరెడ్డి, పోగుల సతీశ్, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, బషీర్, కడవండి మహేశ్, పాతర్ల నాగరాజు, బొడ్డు రాకేశ్ పాల్గొన్నారు.

### సింగరేణి కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి



కేంద్ర మంత్రికి సమస్యలు వివరిస్తూ...

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఉన్న సింగరేణి కార్మికుల సంక్షేమం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేశ్‌నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. ఢిల్లీలో మంగళవారం కేంద్ర మంత్రిని కలిసి సింగరేణి కార్మికుల సమస్యలను వివరించారు. కార్యక్రమంలో తిరుపతి, వెంకటకృష్ణ, శ్రీదేవి, సంతోశ్, దివ్య, దేవేందర్ పాల్గొన్నారు.

### మైనార్టీలకు సీట్లు కేటాయించాలి

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ పాఠశాలలో మైనార్టీలకు సీట్లు కేటాయించాలని మండల ఎంఐఎం అధ్యక్షుడు ఎండి ఆలీ, టౌన్ ప్రెసిడెంట్ ఎస్.కె.జహీర్‌అహ్మద్ అన్నారు. దేవాపూర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. యాజమాన్యం మైనార్టీలపై వివక్ష వీడాలని, లేకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు హెచ్చరించారు.

### నర్సింహారావుకు డాక్టరేట్



అవార్డు అందుకుంటున్న నర్సింహారావు

మంచిర్యాలఅర్బన్: భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) ద్వారా సామాజిక, ఆధ్యాత్మిక సేవలందించినందుకు ఆదివారం మద్రాస్‌లోని రమదాన్ హాల్‌లో సౌతేర్న్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్సిటీ సంస్థ మంచిర్యాలకు చెందిన నర్సింగరావుకు డాక్టరేట్, సోషల్ వర్కర్ అవార్డును అందజేసింది.

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

భీమారం: కుమ్మరి గూడెంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీవో రాధారాథోడ్ తనిఖీ చేశారు. పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీచర్‌కు పలు సూచనలు చేశారు. బాలింతలకు బాలామృతం పంపిణీ చేశారు.



బాలామృతం పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

# నిరుద్యోగుల సమస్యలపై వినతి



మంచిర్యాల తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ...

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాల తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు బింగి సత్యనారాయణ, కార్యదర్శి బోయిని హరికృష్ణ, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పల్లి రాకేశ్, ఠాకూర్ తరుణ్ సింగ్, సంద రాజు, రామగిరి సూర్యతేజ, సంద అభిలాష్, ఆంజనేయులు, రాంవిలాస్, రోహిత్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరుద్యోగులు నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ రాఘవేంద్రరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సిద్ధార్థ, వెంకటేష్, రాజేష్, తరుణ్, శ్రీనివాస్, నరేష్ చంద్ జైన్, ప్రభాకర్, రమణ, రాజేందర్ పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల బీజేవైఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం నిరుద్యోగ సమస్యలపై పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు అందజేస్తూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు చౌతకారీ రాకేశ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హబ్‌జెండర్‌లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థినులకు జిల్లా సంక్షేమ శాఖకు చెందిన మహిళా సాధికారక హబ్‌జెండర్ స్పెషలిస్టు మౌనిక మహిళా సాధికారతపై మంగళవారం అవగాహన కల్పించారు. బేటీ బచావో, బేటీ పడావో పథకం, లింగనిర్ధారణ చట్టం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, మహిళా హెల్ప్‌లైన్ 1930, సఖీ హెల్ప్‌లైన్ 181, చైల్డ్‌లైన్ 1098లపై విద్యార్థినులకు వివరించారు. సుకన్య సంవృద్ధి యోజనా, మిషన్ వాత్సల్య, ఆడపిల్లల ప్రాముఖ్యత, మహిళా సాధికారత, హెల్ప్‌లైన్ల గురించి అవగాహన కల్పించారు.

## సంక్షిప్త వార్తలు

**దరఖాస్తుల ఆహ్వానం**

కాసిపేట: మండలంలోని తెలంగాణ మోడల్‌స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో మిగిలిన సీట్లకు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య తెలిపారు. 6వ, 8, 9, 10 తరగతులకు సైతం మిగులు సీట్లకు అడ్మిషన్స్ తీసుకోనున్నట్లు, ఆసక్తి కలిగిన వారు ఆఫ్‌లైన్ ద్వారా ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు.

**ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి**

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇవ్వకుండా ఇబ్బందికి గురిచేస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి శైలజకు వినతిపత్రం అందజేశారు.

**నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ**

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని ఆదిల్‌పేట్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ బుధవారం ఉదయం 11గంటలకు ఉంటుందని జెడ్పీటీసీ వేల్పుల రవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరై విగ్రహావిష్కరణ చేస్తారన్నారు.

**వైద్యులకు సన్మానం**

మంచిర్యాలటౌన్: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మంచిర్యాల మహిళా తరంగిణి ఆధ్వర్యంలో మహిళా వైద్యులైన అన్నపూర్ణ, రాచకొండ హిమబిందు, అశ్విని, దివ్యలను శాలువా కప్పి, బహుమతులు అందించారు. రాముని చెరువు వాకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు వెంకటేశ్వర్‌రావు, త్రినాథరావు, సాల్మాన్‌రాజు, మూర్తి, జి.సుధాకర్‌లను సన్మానించారు.

**కరపత్రాలు ఆవిష్కరణ**

చెన్నూర్: ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఈ నెల 7న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ టీజీ ఆధ్వర్యంలో తలపెట్టిన దీక్షను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి తగరం మధురాజ్ అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో దీక్ష కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు.

**పరిషత్ పాలకవర్గ సభ్యులకు సన్మానం**

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా, మండల ప్రజాపరిషత్‌ల పాలకవర్గాల పదవీ కాలం ముగియనుండగా మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు మంగళవారం ఆయన నివాస గృహంలో సభ్యులకు ఘన సన్మానం చేశారు.